మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట



# బహిరంగ మార్కెట్ ప్రకారం ధర కట్టివ్వాలి

### న్యాయమైన పరిహారం అందివ్వాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న భూనిర్వాసితులు

**నారాయణపేట టౌన్, జూలై 17 ప్రభాతవార్త :** నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధర కనుగుణంగా న్యాయమైన పరిహారం అందివ్వాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి,జిల్లా అధ్యక్షులు మచ్చేందర్ డిమాండ్ చేశారు. గురువారం నారాయణపేట మండల పరిధిలోని పేరపల్ల గ్రామస్తులు పట్టణ కేంద్రంలోని సుభాష్ రోడ్డు నుండి పాత బస్టాండ్ మీదుగా ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం చేరుకోని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంకి వ్యతిరేకం కాదని భూ నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా బేసిక్ ధరను నిర్ణయించి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తామన్న రూ. 14 లక్షలు నష్టపరిహారం ఆమోదం కాదన్నారు. వివిధ గ్రామాలలో భూనిర్వాసితులను అధికారులు బెదిరిస్తున్నారని బెదిరింపులు మానుకోవాలని తెలిపారు. న్యాయమైన పరిహారం అందేదాకా ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారి అనిల్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

### జటప్రోల్‌లో సీఎం పర్యటనకు

# ముమ్మర ఏర్పాట్లు


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శుంకుస్థాపన చేయనున్న సీఎం
- స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ చేయనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,కొల్లాపూర్, జూలై 17 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాటి పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది. ఈ క్రమంలో సీఎం టూర్‌ను సక్సెస్ చేసేందుకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**సీఎం పర్యటన వివరాలు**

- మధ్యాహ్నం 1గంటకు బేగంపేట్ ఏయిర్ పోర్టు నుంచి బయలుదేరుతారు
- మధ్యాహ్నం 1:45కు జటప్రోలుకు చేరుకుంటారు
- మధ్యాహ్నం 1:55కు జటప్రోలు మదనగోపాల స్వామివారిని దర్శించుకుంటారు
- మధ్యాహ్నం 2:10కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాప
- మధ్యాహ్నం 2:20 నుంచి ప్రసంగాలు సాయంత్రం 4:15కు వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళల స్వయం సహాయ సంఘాల సభ్యులకు పంపిణీ (ఇందిరా మహిళ శక్తి పథకం కింద) చేస్తారు.

కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సీఎం పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై మంత్రి జూపల్లి సమీక్ష - మిగతా2లో..

### సమయాన్ని సద్వినియోగం చేసుకుని

# లక్ష్యాన్ని సాధించాలి

- ప్రతి ఒక్కరికీ రోజుకు 24 గంటల సమయమే
- లక్ష్యం కోసం కృషి చేస్తారో వారే ఎదుగుతారు
- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా


విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా

**నారాయణపేట ప్రతినిధి/ మద్దూర్, జూలై 17 ప్రభాతవార్త :** విద్యార్థులు తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యం సాధించాలని, ప్రతి ఒక్కరికీ రోజుకు 24 గంటల సమయమే ఉంటుందని, కానీ ఆ సమయంలో ఎవరైతే తమ లక్ష్యం కోసం కృషి చేస్తారో వారే జీవితంలో ఎదుగుతారని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా అన్నారు. విద్యా శాఖ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిం చేందుకు నారాయణపేట జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె బుధవారం రాత్రి మరికల్ కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి సందర్శించారు. గురువారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గంలోని కొత్తపల్లి మండలం నిడ్జింత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆ పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహారం పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి వారూ తిన్నారు. అల్పాహారం బాగుందని హరేకృష్ణ మూమెంట్ ఫౌండేషన్ సభ్యులను ఆమె అభినందించారు. పాఠశా లలో అల్పాహారం అందిస్తున్నందున విద్యార్థుల సంఖ్య ఎంత పెరి గిందని పాఠశాల హెచ్ఎంను అడిగారు. 80 నుంచి 90 శాతం పెరిగిందని హెచ్ఎం సమాధానం ఇవ్వడంతో వందశాతం పెరగాల ని ఆమె సూచించారు. తర్వాత అక్కడే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత (తె /ఇ మీడియం) పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత నియోజక వర్గంలో అంది స్తున్న అల్పాహారం పథకాన్ని విద్యార్థులు వినియోగించుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. రోజూ పాఠశాలకు రావాలన్నారు. పాఠశాలలో విద్యార్థులందరూ చాలా చురుకుగా ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపిస్తున్నారని చెప్పారు. అందరూ ఇష్టంతో కష్టపడి చదివితే వచ్చే పదేళ్లలో మీలోనే కొందరు డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు, కలెక్టర్, ఎస్పీ అవుతారని ఆమె తెలిపారు. ఏమి కావాలో ఇప్పుడే నిర్ణయించుకుని ఆశయం వైపు వెళ్లాలని సూచించారు. కొందరు 24 గంటల్లో పది గంటలు నిద్ర పోతారు.. మరికొందరు 5 గంటలు టీవీ చూస్తారు.. కానీ 24 గంటలు ఆశయ సాధన కోసం కృషి చేసే వాళ్లే వృద్ధిలోకి వస్తారన్నారు. ముఖ్యంగా పెద్దలు, ఉపాధ్యాయుల మాట వినాలని చెప్పారు. ప్రస్తుత నారాయణ పేట ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ 15 సంవత్సరాల క్రితం జనగామ జిల్లా నాగారం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్నారని, మీలాగే ప్రభుత్వ బడిలోనే ఇలాగే ప్రార్థనలో నిలబడే వారని, కానీ ఇప్పుడు ఐఏఎస్ అయ్యారని ఆమె తెలిపారు. సంకల్పం ఉంటే సాధించ గలరన్నారు. అర్జునుడు పక్షి కన్నుపై బాణం గురి పెట్టిన కథను ఈ సందర్భంగా యోగితా రాణా విద్యార్థులకు ఉదాహరిస్తూ తెలిపారు. విద్యార్థులు కూడా తమ లక్ష్యంపై గురి పెడితే ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌లా ఐఏఎస్ సాధించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారంలో ఒక రోజు మోటివేషన్ చేస్తూ విద్యార్థులతో ఇంట్రాక్ట్ అవ్వాలని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్‌కు సూచించారు. తర్వాత ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలను, విద్యార్థులను చూస్తుంటే తనకు స్కూల్ డేస్ గుర్తు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఏఎస్ కావడానికి తానే ఒక ఉదాహరణ అన్నారాయన. 2047 వరకు మీరంతా గొప్ప గొప్ప స్థాయిల్లో ఉంటారనీ, ఉండాలని -మిగతా2లో..


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా

# ఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు

- రాబోయే రోజుల్లో మైనార్టీలకు మార్కెట్ చైర్మన్ పదవి కేటాయిస్తాం
- విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో సత్తా చాటాలి
- మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- న్యాక్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందజేత


మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, జూలై 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతి వేడుకలను ఇవాళ మక్తల్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి సాయన్న చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. దొరలను రజాకార్లను ఎదిరించే గుండె ధైర్యం కలిగిన పండుగ సాయన్న నిరుపే దలకు సాయం చేసి తెలంగాణ రాబిన్ హుడ్ అని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు జ్యోతిబాపూలే ఉట్కూరు బాలికల గురుకుల పాఠశాల యందు బాలికల విభాగంలో కేలో ఇండియా సైక్లింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 72 మంది విద్యార్థినీలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ద్వారకా ఫంక్షన్ హాల్లో జరిగిన మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 200 ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ - మిగతా2లో..

# మహిళా సాధికారతే లక్ష్యం

- ఇందిరా మహిళా శక్తి సంబురాలు..
- దోమలపెంటలో ఇందిర మహిళ విజయోత్సవం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, జూలై 17 ప్రభాతవార్త:** మహిళ సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతూ మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలపై దోమలపెంట గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన - మిగతా4లో..


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

### భూ సమస్యల దరఖాస్తులను

# పరిష్కరించాలి

- విద్యా, ప్రభుత్వ సంస్థలకు స్థలాలను గుర్తించండి
- తహసీల్దార్లకు కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 17, ప్రభాతవార్త:** భూ భారతి, రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తహసీల్దార్‌లను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహశీల్దార్లతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించి భూభారతి దరఖాస్తులు, కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారం,రేషన్ కార్డుల ఫీల్డ్ ఎంక్వైరీపై సమీక్షించారు. భూ భారతి, రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలకు సంబంధించి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు, వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎంత మందికి నోటీసులు అందజేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కానీ వారికి నోటీసులను తహసీల్దార్లు జారీ చేయాలని, దరఖాస్తులో పేరు, కులం, ఆధార్ కార్డు, అడ్రస్, మిస్సింగ్ సర్వే నెంబర్, సాదా బైనామా, ఫారెస్ట్ ల్యాండ్ తదితర సమస్యలపై - మిగతా2లో..

# ఇందిరమ్మ స్ఫూర్తి... మహిళా శక్తి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

- వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, జూలై 17 ప్రభాతవార్త:** ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం దేవరకద్ర మండల కేంద్రంలోని స్థానిక శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి సంబరాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటుందని, ప్రభుత్వ పథకాలను మహిళా సంఘాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని జిఎంఆర్ కోరారు.ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని అన్నారు. దేశంలోనే మహిళల ఆదర్శమూర్తి మన ఇందిరా గాంధీ అని, మీరు కూడా ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గరీబి హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలన కోసం కృషిచేసిందన్నారు. పాలమూరోళ్ళం మాట మీద ఉండేటోళ్ళం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు. అందుకోసమే మహిళలను ఉన్నత స్థాయికి చేర్చడానికి మన ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. అందుకోసమే మహిళల పేర్ల మీదనే నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఆర్టీసీ బస్సులు, సోలార్ యూనిట్లు , పెట్రోల్ బంకులు, మహిళలకే ఇచ్చి, వారి ఆదాయం పెరిగే విధంగా చేసిందన్నారు. మహిళలు తయారుచేసిన వస్తువులను శిల్పారామంలో అమ్మే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, మహిళలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అలాగే ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రూ. 500లకే సిలిండర్ లాంటి హామీలను నెరవేర్చిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మూడు మాత్రమే ఇచ్చి అన్ని ఎగ్గొట్టింది. మహిళలను ఉన్నత స్థాయికి చేర్చడానికి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. మొదటి ఏడాదిలోనే లక్ష్యానికి మించి రూ.21600 కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేశామన్నారు.గత ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక్క కాలేజీ, ఆసుపత్రి తీసుకురాలే, మన ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంబడే నియోజకవర్గ కేంద్రానికి 100 పడకల ఆసుపత్రి, డిగ్రీ కాలేజీ, మంజూరు చేసినట్లు తెలిపారు. డిగ్రీ కాలేజ్ కోసం భవనాన్ని తొందర్లోనే నిర్మిస్తామని అన్నారు. సొంత నిధులతో విద్యార్థులకు ట్రై, బెల్టులు యూనిఫాంలు పంపిణీ చేశామన్నారు. వివోఏలకు జీతాలు పెంచడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ ను తీసుకువచ్చి రెండువేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించబోతున్నాం అని తెలిపారు. గ్రామాల లో భూ సమస్యలు లేకుండా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను త్వరలోనే అందజేస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఎవరికైనా రేషన్ కార్డు రాలేదో ఎప్పుడైనా దరఖా స్తు చేసుకోవచ్చని తెలిపారు. తదనంతరం మహిళ శక్తి సంబరాల్లో భాగం గా 2487 మహిళా సంఘాలకు రెండు కోట్ల 78 లక్షల 28 వేల రూపా యల వడ్డీ లేని రుణాల చెక్కులను, 255 మహిళా - మిగతా2లో..


హాజరైన మహిళలు

# యువతకు డిజిటల్ పబ్లిక్ లైబ్రరీ

### నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి



డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి,జూలై 17 ప్రభాతవార్త:** పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు డిజిటల్ పబ్లిక్‌లైబ్రరీ ఒక వరమని నాగర్‌కర్నూల్ పార్ల మెంటుసభ్యులు మల్లురవి అన్నారు.గురువారం జిల్లాకేంద్రంలోని జిలా గ్రంథాలయంలో యూనియన్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా వారి సిఎస్ఆర్‌లో భాగంగా ఏర్పాటుచేసిన డిజిటల్ లైబ్రరీని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ - మిగతా2లో..

## దర్గాను దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూరు పట్టణంలో దర్గాను దర్శించుకుంటున్నా మంత్రి

**ఆత్మకూర్ జూలై 17, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో బుధవారం నుండి ప్రారంభమైన హజరత్ సయ్యద్ సాహెబ్ ఉర్సు ఉత్సవాలలో భాగంగా గురువారం రోజు రాష్ట్ర పాడి పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో రెండు రోజులపాటు కొనసాగుతున్న దర్గా ఉత్సవాలలో భాగంగా గురువారం రోజు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొనగా మజీద్ మత పెద్దలు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించి చాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్, రహమతుల్లా, తులసిరాజు యాదవ్, గంగాధర్ గౌడ్ ,నల్లగొండ శ్రీనివాసులు, మణి వర్ధన్ రెడ్డి, తదితరులతో పాటుగా పలువురు ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆత్మకూరును సాధిద్దాం: మున్సిపల్ కమిషనర్

**ఆత్మకూర్ జూలై 17, ప్రభాతవార్త;** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేకంగా స్వచ్ఛ ఆత్మకూరుగా తీర్చిదిద్దుదామని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం రోజు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 10 వార్డులలో బహిరంగ ప్రదేశాలలో చెత్తాచెదారం వేస్తే పట్టణ ప్రజలకు జరిమానా విధించబడుతుందని బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేసిన వారికి సైతం జరిమానా విధించేందుకు పొందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి మైత్రివనంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్ ను స్వచ్ఛ ఆత్మకూరుగా మార్చే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందిస్తున్నటువంటి ప్రణాళికలకు పట్టణ ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులకు సమాచారం అందించడమే కాకుండా సహకారం కూడా కోరుతున్నట్టుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటుగా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సకాలంలో

## పూర్తి చేసుకోవాలి : డీసీసీ జిల్లా కార్యదర్శి



అమరచింతలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**అమరచింత, జూలై 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సకలములో పూర్తి చేసుకోవాలని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. గురువారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని 3,10, వార్డులలో ఇండ్లు లేని పేదలకు మంజూరైన లబ్ధిదారుల ఇంటిదగ్గర ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇండ్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయముగా ముందుకెళుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తౌఫిక్, విష్ణు, హనుమంతు నాయక్, శ్యాం కుమార్, ప్రకాశం, ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, పెద్ద బాలరాజ్, అశు, కడియాల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ యాదవ్**



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, జూలై 17 ప్రభాతవార్త:** నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా మారిందని, ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్ వినియోగించుకోవాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుల్ల ప్రేమ్ కుమార్ యాదవ్, ఓబిసి మండల అధ్యక్షులు గోపాల్ అన్నారు. నాగన్న పల్లి గ్రామానికి చెందిన బాల్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రభుత్వంద్వారా ఆర్థికసహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి బాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌అధ్యక్షులు గోవర్ధన్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు నర్సి రెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీను, ఉప సర్పంచ్ మైబు, అంకిళ్ల రాములు, గద్మలి సత్తన్న, హరిజన్ చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కాలనీలో సమస్యలను పరిష్కరించండి

**మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేసిన యువకులు**



వినతిపత్రం అందజేస్తున్న కాలనీ యువకులు

**పెబ్బేరు, జూలై 17 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్లో నెలకొన్న పలు సమస్యల పైన 1వ, 2వ ఫిల్టర్ వాటర్ షెడ్లు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ యువకులు కోరుతున్నారు. 1,2వ వార్డులలో ఇళ్ల మధ్యన ఉన్నటువంటి ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉండటం వల్ల జనావాసంలోకి విష సర్పాలు, దోమల అధికంగా రావడం వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడడం జరుగుతుంది. పిచ్చి మొక్కలను తొలగించి తమను రోగాల బారిన పడకుండా కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేనందున మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబు కి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎద్దుల సాయినాథ్ యువసేన సభ్యులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కమిషనర్ కు సమస్యల గురించి వివరించి వీలైనంత త్వరగా సమస్యలు పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## డికేఅరుణను సన్మానించిన బిజెపి నాయకులు



ఎంపి డికె అరుణను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**నారాయణపేట టౌన్, జూలై 17 ప్రభాతవార్త :** తెలంగాణ ఫుడ్ కార్పొ రేషన్ అఫ్ ఇండియా చైర్ పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను గురువారం హైద్రాబాద్‌లోని కార్యాలయంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు నాగు రావు నామాజీ, కే.రతంగ్ పాండు రెడ్డి, జిల్లా బిజెపి మాజీ అధ్య క్షుడు పగుడాకుల శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఎం.భాస్కర్, తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు



**అచ్చంపేట, జూలై 17 ప్రభాతవార్త:** అష్టాదశశక్తి పీఠాల్లో ఒకటైన శక్తిపీఠం శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని ఈ తెల్లవారు జామున స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి అర్చక, వేద పండితులు తిలకధారణ చేశారు. అధికారులు పూలమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లన్నకు గర్భాలయంలో పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, జ్ఞాపికను అందజేశారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

## మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం పిలుపు



ఆత్మకూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**ఆత్మకూర్ జూలై 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాడన్ని టిఆర్ఎస్ కార్యకర్తలు గుర్తించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అహర్నిశలు కృషి చేయాలని మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ సమీపంలో జరిగిన మండల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తున్నాడా అని నిరసిస్తూ టిఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెబితేనే కాంగ్రెస్ నాయకులకు జ్ఞానోదయం పలుకుతుందని ఆయన హితవు పలికారు. శాసనసభ ఎన్నికల సమయంలో రైతుల రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్టు వేసి మాట మార్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు ప్రతి మహిళకు 2500 రూపాయల చొప్పున చెల్లిస్తానని అంతేకాకుండా రైతు భరోసా నిధులను 7500 చొప్పున రైతులకు ఇస్తామని చెప్పి ఇప్పటికే గడచిన 19 నెల కాలంలో రెండుసార్లు రైతు భరోసానితులను ఎగ్గొట్టిన ముఖ్యమంత్రిగా పేరు గడించడం రేవంత్ రెడ్డి కే చెల్లిందన్నారు.



కార్యకర్తల సమీక్ష సమావేశానికి హాజరైన కార్యకర్తలు

మక్తల్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిపోతుందని కాంగ్రెస్ నాయకులు రాజకీయాలను వదిలి ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాలని ఇతవ్ పలికారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ టిఆర్ఎస్ జండా ఎగరవేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశానికి ఆత్మకూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వీరేశలింగం కోటేశ్వర్ లక్ష్మీ కాంత్ రెడ్డి గాయత్రీ రవికుమార్ యాదవ్, కొత్తబోయే శేఖర్ గడ్డమీది శ్రీనివాసులు జానకి రాములు ఆంజనేయులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయరా!

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ అజయ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్

**అమరచింత జూలై 17, ప్రభాతవార్త:** మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని, డిఎంఆర్ ప్రభుత్వ హాస్పిటల్‌లో 24 గంటలు ఆరోగ్య సేవలు, జూరాల, చంద్రగట్ కోటను పర్యటక కేంద్రాలుగా చేస్తానని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అనేక వాగ్దానాలు చేసిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయరా అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ ప్రశ్నించారు. గురువారం అమరచింత మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టుకు అనేక రాష్ట్రాల నుండి పర్యాటకులకు వస్తున్న మస్తీపురం గ్రామంలో రోడ్డు బాగాలేక పర్యటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు జోక్యం చేసుకొని మస్తిపురం గ్రామంలో రోడ్డు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అమరచింత మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఆవరణలో శిథిల వ్యవస్థలో ఉన్న భవనాలను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించిన ఇప్పటివరకు పాత భవనాల అలాగే ఉన్నాయని వెంటనే శిథిల వ్యవస్థలో ఉన్న భవనాలను తొలగించి జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ గ్రౌండ్ ను మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని కోటి నిధులు ప్రకటించిన ఇప్పటివరకు పనులు జరగడంలేదని ఆయన అన్నారు. అలాగే అమరచింతలో ఒక బ్యాంక్ ఉండడంవల్ల ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రాష్ట్ర మంత్రివర్యులు జోక్యం చేసుకొని అమరచింతలో బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో దళిత కాలనీకి తీవ్ర అన్యాయం జరిగిందని ఇప్పటివరకు దళిత వాడకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇండ్లు లేని దళితులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్ విజయ్, సైకిల్ కురుమన్న, తదితరులు ఉన్నారు.

## సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని సాధించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

ట్రైనీ కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, కలెక్టర్, కడ అధికారి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యంగ్ ఓరియంటేషన్‌లో భాగంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన రోల్ ప్లే కన్వర్జేషన్‌ను పరిశీలించారు. ఐదో తరగతి విద్యార్థులకు స్వయంగా ముఖ్య కార్యదర్శి యోగితారాణా లెట్‌బీ ఫ్రెండ్స్ అనే ఆంగ్లపాఠాన్ని బోధించారు. వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. పక్కన గదిలో ఎఫ్ఎల్ఎన్ఏ ఎక్స్ఎల్ 1 డిజిటల్ క్లాస్‌ను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్ వాడుతున్నారా లేదా ? అని ప్రత్యేకంగా చూడాలని, వారంలో ఒకరోజు పాఠశాలకు వెళ్ళి గంట పాటు టీచర్ బోధించే ఆంగ్ల పాఠాన్ని పర్యవేక్షించాలని డీఈఓ గోవిందరాజులును ఆమె ఆదేశించారు. చివరగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులతో గంట పాటు విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై గంట పాటు సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్లు వెంకట నరసమ్మ, మదన్, ఆర్జెడి విజయలక్ష్మి, తహసిల్దార్ జయ రాములు పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

## జటప్రోల్‌లో సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి భాగం..

జరుపుతున్నారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పర్యటన సజావుగా జరిగేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ… శుక్రవారం ముఖ్యమంత్రి కొల్లాపూర్ నియోజకవర్గంలో పెంటవెల్లి మండలం జటప్రోల్లో, మదనగోపాల స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం సభస్థలికి చేరుకొని నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళ సంఘాలకు రుణాలను అందజేయనున్నారు. కొత్త పనులకు శంకుస్థాపనలు, శ్రీకారం చేయనున్న సందర్భంగా పెంటవెల్లి మండలం జటప్రోల్లో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ వెళ్ళి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, దినసరి సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ మల్లు రవి, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## ఇందిరమ్మ స్ఫూర్తి... మహిళా శక్తి

మొదటి పేజీ తరువాయి భాగం..

సంఘాలకు 25 కోట్ల 20 లక్షల 25 వేల రూపాయల రుణాలకు సంబంధించిన చెక్కులను, దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల, భూత్పూర్, సిసి కుంట, మండలాల మహిళా సమైక్య సంఘాలు బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీ వారికి అద్దెకివ్వడంతో వచ్చిన ఆదాయం కు సంబంధించి, రెండు లక్షల ఎనిమిది వేల రూపాయ ల చెక్కును, మహిళా సంఘాలకు సంబంధించిన 18 మంది సభ్యుల లోన్ బీమా మొత్తం రూ. 18 లక్షల 9 వేల చెక్కును జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మహిళా సంఘాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ,టి పి సిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి , మార్కెట్ చైర్మన్ కథలప్ప, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘ వేందర్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపిఎం రామన్న, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, అధ్యక్షులు, అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

చేశారు .మైనార్టీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండి సంక్షేమ ఇందిరమ్మ మహిళా శక్తి రేవంతన్న భరోసా వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నాయని తెలియజేస్తూ ఇకపై ఏటా 500 కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. భావోద్వేగం తో మాట్లాడుతూ తన పుట్టింది మక్తల్ గడ్డపైనే పెరిగింది ఇక్క డే చివరి శ్వాస వరకు మక్తల్ లోనే ఉంటానని అభివృద్ధికి ఊహించని రీతిలో చేసి చూపిస్తానని మంత్రి శ్రీహరి హామీ ఇచ్చా రు. జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం మేక ఆధ్వర్యం లో 90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది మహిళలకు మక్తల్‌లో కుట్టుమిషన్లను వారందరికీ అందజేసి మహిళల స్వ యం ఉపాధిని ప్రోత్సహించే సంఘాలను తమ సహాయ సహకా రాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. నియోజవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 140 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ చైర్మెన్ ఒబే దుల్ల కొత్వాల్ ,బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ గవినోళ్ళ బాలకృష్ణా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జి.లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, డైరెక్టర్లు పసుల రంజిత్ రెడ్డి, కాంగ్రె స్ నాయకులు, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు కోళ్ల వెంకటేష్, సలాం, ముస్లిం మైనారిటీ నాయకులు సంబంధిత వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

వచ్చిన దరఖాస్తులను పరిశీలించి. ఫీల్డ్, డెస్క్ పరిశీలన పూర్తి చేస్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం చేయాలని తహశీల్దార్ లను ఆదేశించారు. తహశీల్దార్ల లాగిన్‌లో పెద్ద సంఖ్యలో రేషన్ కార్డుల అప్లికేషన్లు ఉన్నాయని, ఆర్.ఐ.ల వద్ద అప్లికేషన్ వెరిఫికే షన్ చాలా నిదానంగా చేస్తున్నారని, వెంటనే అన్ని అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి డి.ఎస్.ఓ. లాగిన్‌కు పంపించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. భూత్పూర్ భూదాన్ స్థలానికి సంబంధించి అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి వివరాలను సమర్పించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మండలంలో ఒక ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు ప్రభుత్వ భూములను ప్రభుత్వ ఎడ్యుకేషనల్, ఇతర ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేయడం కోసం సరైన స్థలాన్ని గుర్తించాలని, వారంలోపు స్థలానికి సంబంధించిన వివరాలను సమర్పించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ. నరసింహా రెడ్డి, ఆర్డీఓ నవీన్, కలెక్టరేట్ ఏ.ఓ. సువర్ణ రాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## యువతకు డిజిటల్ పబ్లిక్ లైబ్రరీ

మొదటి పేజీ తరువాయి భాగం..

చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి, రిబ్బన్ కటింగ్‌తో ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు డిజిటల్ లైబ్రరీ ఒక వరమన్నారు. ఈ డిజిటల్ లైబ్రరీ ద్వారా పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని విషయాలను ఆన్లైన్ క్లాసెస్ ద్వారా వినవచ్చుని చెప్పారు. అంతేకాకుండా, ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని విషయాలు కూడా డిజిటల్ లైబ్రరీలో మిళితమై ఉన్నాయని వాటిని గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో తాగునీటి సమస్య గురించి విద్యార్థులు ప్రస్తావించగా ఎమ్మెల్యే మెగారెడ్డి స్పందిస్తూ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మెగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి డిజిటల్ లైబ్రరీ వనపర్తిలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డిఆర్‌డిఒ ఉమాదేవి, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిజిఎం భాస్కరరావు, రీజనల్ హెడ్ సత్యనారాయణ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 21న అచ్చంపేటకు మంత్రుల రాక

**అచ్చంపేట, జూలై 17 ప్రభాతవార్త:** ఈ నెల 21న అచ్చంపేట పట్టణంలో నిర్వహించే ఇందిర మహిళ శక్తి సంబురాలు, రేషన్ కార్డు లబ్దిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మరియు బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర మంత్రులు సీతక్క, దా మోదరరాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిలు, ఎమ్మెల్యే హాజరుకానున్నారు అని అచ్చంపేట ఎమ్మె ల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. 21 సోమవారం సాయంత్రం 3:00గంటలకు ఎన్టీఆర్ స్టేడియం అచ్చంపేటలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అచ్చంపేట నియోజ కవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, రైతులు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, వాటర్ బాటిల్ పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూలై 17 ప్రభాతవార్త:** అవోపా కల్వకుర్తి యూనిట్ అధ్యక్షులు పాపిశెట్టి సతీష్ గుప్తా ఆధ్వర్యంలో కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ఎల్లయ్య గౌడ్ అధ్యక్షతన 70 మంది విద్యార్థులకు నోట్స్, పరీక్ష ప్యాడ్స్, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి సతీష్ గుప్త మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అవోపా జనరల్ సెక్రెటరి యాద శోభన్ బాబు, సీనియర్ అవోపా సభ్యులు గాదె కుమారస్వామి, గాదె ఉమాదేవి, పోల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జన్ సురక్ష అవగాహన సదస్సు

**ఊట్కూర్, జూలై 17 ప్రభాతవార్త :** ఊట్కూరు మండల కేంద్రం లోని సమీస్తాపూర్ గ్రామంలో ఎస్బిఐ వారి సౌజన్యంతో జన్ సురక్ష అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ మోసెస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలలో ఇన్సూరెన్స్‌లపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరసత కేంద్రం సభ్యురాలు చాంద్ సుల్తానా గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

### ఎమినేటర్లు, ఆపరేటర్లకు

## పారితోషికం చెల్లింపులో నిర్లక్ష్యం

**ఊట్కూర్, జూలై 17 ప్రభాతవార్త :** సమగ్ర కుటుంబ సర్వే 2025లో మన జిల్లాలో నిష్టతో పనిచేసిన ఎమినేటర్ల ఆపరేటర్లుకు ఇప్పటికీ తగిన పారితోషికం కోసం ఎదురు చూస్తున్నారు. సర్వే ముగిసి నెలలు గడుస్తున్నప్పటికీ, బాధ్యత వహించిన అధికారులు డబ్బులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చదువుకున్న యువతకు ఉపాధిగా వచ్చిన ఈ అవకాశం చివరికి అన్యాయంగా మారింది" అని వారు వాపోతున్నారు. ఈ చెల్లింపులు తక్షణమే జరపాలని సంబంధిత శాఖలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని కుటుంబ సర్వేచేసిన సందీప్ మహేష్ ప్రవీణ్ తెలిపారు.

### డ్రైవింగ్ లైసెన్స్ లేని, అతివేగంతో

## వెళుతున్న ట్రాక్టర్ల పట్టివేత

### ఎంవిఐ అధికారి వాసుదేవారావు



పట్టుకున్న ట్రాక్టర్లపైతో ఎంవిఐ అధికారి

**పెబ్బేరు, జూలై17 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలో గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లు అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న 5 ఇసుక ట్రాక్టర్లను గురువారం పెబ్బేరు ఎంవీఐ వాసదేవరావు పట్టుకున్నారు. మాలపల్లె, పెబ్బేరు శివార్లలో వెహికిల్స్ చెకింగ్ చేస్తుండగా అర్హత లేని యువకులు అతివేగంగా, సౌండ్ బాక్స్‌లు పెట్టుకొని ఇసుక ట్రాక్టర్లను నడుపుతుండటంతో వారిని ఆపి ఎంవీఐ ఆఫీసుకు తరలించారు. విత్ అవుట్ డ్రైవింగ్ లైసెన్స్, విత్ అవుట్ పర్మిట్, విత్ అవుట్ టాక్సల కింద కేసు నమోదు చేసి,5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వెహికిల్స్ నడపాలని లేనిపక్షంలో ఫైన్ లేదంటే శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

# వరుణా..నీ కరుణేది...

## తిరుమలగిరిలో గ్రామస్తుల వర్ధపాశం



గ్రామస్తులు వర్ధపాశం పోస్తున్న దృశ్యం

**వంగూరు, జూలై 17 ప్రభాతవార్త:** రైతన్నలు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండాలంటే సకాలంలో వర్షాలు కురిసి వరుణ దేవుడు కరుణ చూపిస్తే రైతన్న ఇంట సిరుల పండగ నిలుస్తుంది కానీ సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం వల్ల రైతన్నలు వేసిన పంటలు ఎండిపోవడంతో వర్షాలు కురిపించాలని రైతన్నలు గురువారం వర్ధపాశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వంగూరు మండలం తిరుమలగిరి గ్రామంలో మాజీ సర్పంచ్ మల్లయ్య ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు గ్రామ సమీపంలో ఉన్న గుట్టపైకి గ్రామంలో పురవీధుల గుండా తిరిగి వర్ధపాశాన్ని గుట్టపై పోసి సకాలంలో వర్షాలు కురిపించాలని వరుణ దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌యాదవ్, గోవర్ధన్, లక్ష్మమ్మ, హుస్సేన్, సైదులు, రమేష్,రాములు, ధర్మరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

**● కళ్యాణలక్ష్మి పేదలకు వరం లాంటిది : ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి**



కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**బిజినేపల్లి, జూలై17 ప్రభాతవార్త:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ప్రతి పేద కుటుంబం ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తుంది అన్నారు. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదని ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుంది అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాలను అందించే బాధ్యత అధికారులదని చెప్పారు. ఎవరైనా పథకానికి దూరంగా ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎలాంటి సమస్య వచ్చినా ఎమ్మెల్యేగా నేను మీకు అండగా ఉంటానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునీరుద్దీన్, ఆర్ఐ భారతి మండల పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు, గంగనమోని తిరుపతయ్య, బంగారి పర్వతాలు, అవంతి శంకర్, ఈశ్వర్, శ్రీనివాసరెడ్డి, గొర్ల అంజి, వీరేష్, రమేష్, నజీర్ పాషా, చంద్రశేఖర్ రెడ్డి, చంద్ర గౌడ్, నరేందర్ గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

**వంగూరు, జూలై 17 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులు మంగ్య నాయక్ అన్నారు. గురువారం వంగూరు మండలం గాజర గ్రామంలో నిర్వహించిన బీజేపీరచ్చబండ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలసమయంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన తర్వాతఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా మాట తప్పిందని ఆయన అన్నారు. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2500లు ఇస్తా అని చెప్పి న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఏఒక్కరికి కూడా ఇవ్వలేదని, డిగ్రీ చదువు తున్న అమ్మాయిలకు స్కూటీలు ఇస్తానని చెప్పి మోసం చేశారని, పింఛన్లు రూ.4 వేల రూపా యలు ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులంబంగారం కూడా ఇస్తానని చెప్పి మోసపూరితహామీలను గుప్పించిమోసం చేశారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు మండికారిబాలాజీ,జిల్లా నాయకులు బల్మూరు జానకమ్మ, సైదులు, మండలఅధ్యక్షులు గున్న ఆనంద్‌రెడ్డి, నాయకులు సంజీవరావు,జగన్మోహన్‌రెడ్డి, సైదులు, కొమ్ము మల్లేష్, సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం

**వనపర్తి, జూలై 17 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీట్, జేఈఈ, క్లాట్ వంటి పోటీ పరీక్షల కు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వారి నుండి ఆన్లైన్లో ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభమైనాయి. బైపీసీ విద్యార్థులకు నీట్‌కు సంబం ధించిన తరగతులు, ఎంపీసీ విద్యార్థులకు జేఈఈకి సంబంధించిన తరగతులు, ఆర్ట్స్ విద్యార్థు లకు క్లాట్ వంటి తరగతులు ఆన్‌లైన్‌లో ప్రారంభమైనాయి. కళాశాలలలో రెగ్యులర్‌గా జరిగే తరగతులతోపాటు పోటీ పరీక్షలకు సంబం ధించిన ఆన్‌లైన్ తరగతులు కూడా ప్రతిరోజు ఇంటర్ బోర్డు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారము నిర్వ హించడం జరుగుతుంది. ఏదేని కారణం చేత ఆన్లైన్ లైవ్ క్లాసులకు హాజరుకాలేని పక్షంలో విద్యార్థులు రికార్డెడ్ వీడియోస్‌ని కూడా చూసే సదుపాయం ఉన్నదని, ఈ కోచింగ్ వల్ల వేల మంది ప్రభుత్వ కళాశాలలలో చదివే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు.

## పెండింగ్ డిఏలను విడుదల చేసి పిఆర్‌సిని అమలు చేయాలి

**ఇటిక్యాల, జూలై 17 ప్రభాతవార్త:** ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఏలను విడుదల చేయాలని అలాగే పిఆర్సిని కూడా వెంటనే అమలు చేయాలని డీటీఎఫ్ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ శాస్త్రి. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. గురువారం ధరూర్ మండలం,గద్వాలలోని పలు పాఠశాలను వారు సందర్శించి డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సంఘం నాయకులు డిటిఎఫ్ సభ్యత్వం నమోదును ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు డిఏలను అమలు చేయడం లేదని, 2డిఏలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్న 1ఒక్క డిఏ మాత్రమే ఇచ్చి మరొకటి అని పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ఈ జూలై నెలలో ఇంకొకటి రావాల్సి ఉందని అందుకు ప్రభుత్వం పెండింగ్ డిఏలను విడుదల చేసి పిఆర్సిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిటిఎఫ్ మాజీ అధ్యక్షులు ప్రభాకర్.సీనియర్ నాయకులు వెంకటకృష్ణ, రాజానందం,జిల్లా ఉపాధ్యక్షులు, హరిబాబు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

**జడ్చర్ల ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** జడ్చర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయం పై గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు అన్న సమాచారం ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు చేయడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ సందర్భంగా ఏసిపి డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో జడ్చర్ల కు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయని ఈ క్రమంలోనే తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. ఏసీబీ అధికారులు పలు రికార్డులను సందర్శించి వివరాలు ఆరా తీశారు.

## ఎఫ్‌సీఐ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా ఎంపీ డీకే అరుణమ్మ బాధ్యతలు

**- వెల్లువెత్తిన అభినందనలు, శుభాకాంక్షలు**

**మహబూబ్‌నగర్,జూలై17, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు, డీకే అరుణమ్మ గురువారం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆమె కార్యాలయానికి చేరుకున్నారు. శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వరరెడ్డి, శ్రీధర్ శ్రీనివాస్ రెడ్డి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు.

## సయ్యద్ మహబత్ అలీ షాఉర్సులో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్, జూలై 17, ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని ఉరెస్ ఈ షరీఫ్ దర్గా వద్ద సయ్యద్ మహబత్ అలీ షాఉర్సు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం పట్టణంలోని ముస్లిలు పెద్ద ఎత్తున ఉర్సు ఉత్సవంలో పాల్గొని ఫతేహాలు సమర్పించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి దర్గా వద్ద ఉర్సులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయనవెంట నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, పిట్టల మురళి, ప్రణీల్‌చందర్, పటోళ్ల నాగిరెడ్డి, కరాటే శ్రీను, శ్రీకాంత్, ఇర్ఫాన్,వల్లూరు వీరేష్,బుక్కా మహేష్, బీకేఆర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

**మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి**





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

**కోయిలకొండ, జూలై17 ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన కోయిలకొండలో గల వీరభద్ర స్వామి దేవాలయంలో టిఆర్ఎస్ పార్టీ విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కోయిలకొండ మండలంలో టిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. వారంటీ లేని ఆరు గ్యారంటీలతో ప్రజలు మోసపోయారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. కార్యకర్తలంతా సమిష్టిగా ఉండి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచుల స్థానాలను కైవాసం చేసుకోవాలని ఆయన సూచించారు.10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం ఆయములో కోయిలకొండ మండలాన్ని ఎంతో అభివృద్ధి పరిచామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ రవీందర్ రెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి కృష్ణ, మాజీ జడ్పిటిసి సభ్యుడు విజయ భాస్కర్ రెడ్డి, ఖాజీపూర్ మాజీ సర్పంచ్ కల్పనా బచ్చిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లయ్య యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, భీమ్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, కో ఆప్షన్స్ సభ్యులు టీవీ కాజా, కొత్త బాద్ మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, మోదీపూర్ రవి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## బస్టాండ్‌లో ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

**మద్దూర్, జూలై17 ప్రభాతవార్త:** కోస్గి బస్టాండ్‌లో దొంగతనాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కోస్గి పోలీసు కానిస్టేబుల్ అంబయ్యగౌడ్ తెలిపారు. కోస్గి బస్టాండ్‌లో ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో గురువారం రోజు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మరియు తమ విలువైన బంగారు వస్తువులను బ్యాగులను, పర్సులను జాగ్రత్తగా ఉంచు కోవాలని,అపరిచిత వ్యక్తులు ఏమైనా తినుబండరాలిస్తే తీసుకో రాదని ప్రయాణికులకు సూచించారు .అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా అన్ని చర్యలు

**● జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్**



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

**వెల్దండ, జూలై17 ప్రభాతవార్త:** జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాల సమగ్ర అభివృద్ధి దిశగా కట్టుదిట్టమైన కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని కొట్ర చౌరస్తాలోని శాస్త్ర పాఠశాలను డీఈవో సందర్శించి పరిశీలించారు.అదేవిధంగా కేస్లీ తాండ, తుమ్మలకుంట తండా, ప్రభుత్వ పాఠశాలను రీఓపెన్ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు నాణ్యతమైన భోజనం గుణాత్మకమైన చక్కని విద్య అందుతుందని, ప్రభుత్వ బడులలోనే పిల్లలను చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. మూతబడిన పాఠశాలలో విద్యార్థులనుచేర్పించిన ప్రధానోపాధ్యాయులను డీఈఓ సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రుడు, శ్రీనివాస్‌రెడ్డి తోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను కాపాడండి





రిలే నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

**బాలానగర్, జూలై17 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ముందు గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి రవి ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం శాంతియుత రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలానగర్ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి అయ్యాయని, కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని, కబ్జాకు గురైన స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించి హద్దులు నిర్మించే వరకుమాపోరాటం కొనసాగుతుందన్నారు.రైల్వే గేట్‌రోడ్డు,పత్రికా విలేకరులకు కేటాయించిన భూమి, పీర్లగుట్టపై వెంకటేశ్వర స్వామిభూమి కబ్జాకు గురైందన్నారు. మండల కేంద్రంలోని వెంచర్లకు సంబంధించి 10% భూములు కూడాకబ్జాకు గురైనట్టుతెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం కార్యదర్శి రవికుమార్, మధు, శ్రీనివాస్ యాదవ్, దినేష్, చింటూ, గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి పిఆర్‌టియు నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, జూలై17 ప్రభాతవార్త:** విద్య పరంగా ఉన్న సమస్యలపై పిఆర్‌టియు నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారంనారాయణ పేట జిల్లా పాఠశాలలలో జరుగుతున్న కార్యక్రమాలు పర్యవేక్షణ చేయడం కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రాణి, డైరెక్టర్ నవీన్ నికోలాస్‌లను పిఆర్‌టియు జిల్లా నాయకులు కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో మర్యాద పూర్వకంగా కలిసి విద్యాపరమైన సమస్యలపై వినతి పత్రంఅందించారు.అనంతరం పిఆర్‌టియు నాయకులు మాట్లాడుతూ ప్రత్యేకంగా అకాడమిక్ ఇన్స్ట్రక్టర్‌లను, నూతన ఎమ్మార్సిలకు మిస్‌లను,డాటా ఎంట్రీ ఆపరేటర్‌ల ను, సిఆర్పిలను నియమించాలని కోరారు.ఎండిఎం బిల్లులుసకాలంలో చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు తిరుపతి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్, భీమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గాయకుడు రాజేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి

**నారాయణపేట ప్రతినిధి, జూలై 17 ప్రభాతవార్త:** ఎస్పి బాలు అభిమాన సంఘం వ్యవస్థపకుడు గాయకుడు రాజేందర్ రెడ్డి కళారంగానికి అందించిన సేవలు మరువలేనివని తన తోటి కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బాలు అభిమాన సంఘాన్ని స్థాపించి ప్రతియేటా జిల్లా, రాష్ట్రస్థాయిలో నృత్య సంగీత పోటీలను నిర్వహించి ఎందరో కళా కారులను ప్రోత్సహించిన గాయకుడు రాజేందర్‌రెడ్డి అని ఎస్పి బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అన్నారు.గురువారం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. కళాకారులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి సతీమణి రాధ, కళాకారులు ప్రభాకర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్, పాండు, సునీల్ లింగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు రాజేందర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

**మానవపాడు, జూలై 17 ప్రభాత వార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూర్ టోల్ ప్లాజా సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోకరు గాయాల పాలయ్యారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల మేరకు గట్టు మండలం గోర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు (25) కురువ నరసింహులు (24) ఇద్దరు కలిసి బైకు పై బుధవారం కర్నూల్ లోని స్నేహితులను కలవడానికి వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా టోల్ గేట్ సమీపంలో కర్నూలు పట్టణానికి చెందిన అరుణ్ స్కూటీ పై రాంగ్ రూట్ లో వచ్చి వారిని ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో గొర్లఖాన్ దొడ్డికి చెందిన బోయ రామాంజనేయులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.మరో వ్యక్తి కురువ నరసింహులుతీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్‌ద్వారా వారిని కర్నూల్ లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మృతుడు బోయ రామాంజనేయులుకు ఐదు నెలల క్రితమే వివాహమైనట్లు సమాచారం. మృతుడుతల్లి బోయ గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు.

## విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇతర సామాగ్రి అందజేస్తున్న అడ్వకేట్స్

**వీపనగండ్ల జులై 17, ప్రభాతవార్త:** బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరి బాలుర వీపనగండ్ల మండలం హెడ్ కోటర్స్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు మరియు గురువారం నాడుస్కూల్లో ఉన్నటువంటి 9వ తరగతి10 పదవ తరగతి విద్యార్థులకు నోటుబుక్స్ ,జామెంట్రీ బాక్స్ పెన్నులు మరియు స్కూల్ బ్యాగులు డిస్ట్రిబ్యూట్ చేయడం చేసినట్లు బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీ కొండారెడ్డి మరియు శ్యాం కుమార్ నరేన్ రాజా అశోక్ కుమార్ ఎండి హైమద్‌భాషా, రఘునందన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల యొక్క భవిష్యత్తు కొరకు వారి యొక్క చేయూతకొరకు అభివృద్ధి కోసంఅన్నిచోట్ల బార్ అసోసియేషన్ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్వకేట్స్ ఇటువంటి కార్యక్రమాలను అన్నిచోట్ల ప్రతి స్కూల్లో అవసరమైన చోట ఈ అడ్వకేట్ వాలంటరీస్ తప్పకుండా వారి అవసరాలను తీర్చడంలో ముందుంటుందని తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలి

**నారాయణపేట జులై 17 ప్రభాతవార్త :** నారాయణ పేట జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహ మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించే నారాయణ పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు తొందరగా పూర్తి చేసి జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం ద్వారా రిజర్వాయర్లకు ఎత్తిపోసే పైపులపనులు పరిశీలించారు. అదేవిధంగా ఈ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. భూమి పూర్తిగా కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా భూమి 40 లక్షలు ఇవ్వాలని అన్నారు.

## మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**దామరగిద్ద, జూలై 17 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నటువంటి ఏపివో, టిఏస్, సివోఎస్, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఆఫీస్ అటెండర్‌లవి 3 నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని మండల కేంద్రంలో ఎంపిడిఓకు విన్నవించడం జరిగింది. లేని యెడల రాష్ట్ర కమిటీ కార్యాచరణ ప్రకారం రేపటి నుండి నిరసనలకు వెళ్తామనిఉపాధి సిబ్బంది తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపివో జయమ్మ, టిఏ లు రవికుమార్, నయీం, నరేష్, స్వామి, సివోలు మహేశ్వరి, ఇందిర, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## కొత్త రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం

**జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు**

**దామరగిద్ద, జూలై 17 ప్రభాతవార్త:** రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో అనుసరించిన రోస్టర్ విధానంతో ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని.తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డారు. విశ్వవిద్యాలయంలో భర్తీ చేసిన 35 అధ్యాపకుల పోస్టుల్లో మాలలకు ఒక్కటి దక్కలేదు 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల్లో ఒకటి దక్కింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గాన్ని వెనకేస్తూ మాలల గొంతు కోశారు వర్గీకరణ విధానంలో మార్పులు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు అదేవిధంగా పోస్టులు 50 ఉంటే ఇడబ్ల్యూఎస్ రెడ్డిలకు 5 వస్తే మాలలకు రెండు మాత్రమే ఒకటి మహిళా కు ఒకటిజెంట్స్‌కు వస్తున్నాయి కాబట్టిఈ రోస్టర్ విధానాన్ని మార్చకుంటే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలోని మాలలు ఏకమై తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

**వీపనగండ్ల జూలై17, ప్రభాతవార్త:** రెండవ పిఆర్సీని వెంటనే ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టి ఎస్ యుటిఎఫ్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి.డి.కృష్ణయ్య డిమాండ్ చేశారు.గురువారం వీపనగండ్ల మండలంలోని కల్వరాల ,గోవర్ధనగిరి,గోపాల్ దిన్నె, సంగినేనిపల్లి , వీపనగండ్ల పాఠశాల గ్రామాలోపనిచేయుచున్న ఉపాధ్యాయులతో టీఎస్ యుటిఎఫ్ సభ్యత్వం నమోదు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న ఐదు డిఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25సవరించాలని, శాస్త్రీయ పద్ధతి లో సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలలోఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కులగణ సర్వేలో చేసిన ఉపాధ్యాయులకు సి.సి.ఎల్, రెమ్యునరేషన్ చెల్లించాలని,2008 డీఎస్సీ కాంటాక్ట్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని కోరారు.ఈకార్యక్రమంలో అధ్యక్షప్రధాన కార్యదర్శులు బి.రామచంద్రయ్య, స్వామి సీనియర్ నాయకులు పి.శ్రీనివాసులు, వై.రామకృష్ణ, దేవేంద్రం,యం. కృష్ణయ్య, జితేందర్, డి మురళి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

**ఇటిక్యాల, జూలై17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలోఏఐసీసీ కార్యదర్శి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటేష్ యాదవ్, జోగులరవి. సోమిరెడ్డి తదితరులు స్వాగతం పలికి శాలువతో సత్కరించారు.జిల్లా కేంద్రంలోనికోర్టుకు హాజరయ్యేందుకు హైదరాబాదు నుండి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ రాగా వారికి స్థానిక నేతలు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాజ్ కుమార్, ప్రభాకర్, తిరుపతయ్య ఉన్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**గద్వాల టౌన్ జూలై 17, ప్రభాతవార్త:** ధరూర్ మండలం లో 1200ఎం ఎం మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ వలన గద్వాల్ జిల్లా ప్రజలకు తాగునీటి సరఫరా లో అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదిత్య తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు చేయు మనవి ఏమనగారెండురోజులు అనగా 18.07.2025 నుండి 19.07. 2025 నీళ్ళ అంతరాయం ఉండవచ్చుననీ ప్రజలు అందరుఈ అంతరాయాన్నీ గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. 20.07.2025 ఉదయం నుండి నీటి సరఫరా పునరుద్ధరించ బడుతుందనీ పత్రిక ముఖంగా సమాచారం తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త : ఏఎస్ఐ

**నవాబుపేట, జూలై17 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్ల ద్వారా మాయ మాటలతో మోసగిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట పోలీస్ అధికారులు ఏఎస్ఐ జనార్దన్ హెచ్చరించారు.సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త. సైబర్ నేరగాళ్లు సెల్ ఫోన్ల ద్వారా మాయ మాటలతో మోసగిస్తారని, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని శక్తి యాప్, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, చట్టపరిధిలో భద్రత, తదితర అంశాలపై ఎస్ఐ విక్రమ్ సూచన మేరకు ఎస్సైజనార్ధన్ ఆధ్వర్యంలో గురువారం నవాబుపేట మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ వివిధ నేరాలు, గంజాయి, మహిళలపై జరిగే నేరాలకు టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098 వినియోగించాలని, మహిళల రక్షణకు శక్తి యాప్‌ను సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఫోన్‌కు వస్తున్న ఫేక్ లింక్‌లను క్లిక్‌చేయవద్దని సూచించారు. వీటిని ఓపెన్‌చేస్తే వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరుతుందన్నారు. అపరిచితులు కాల్‌చేసి ఓటీపీ అడిగితే 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఐయంఎ ఆధ్వర్యంలో టిబి పరీక్షలు

**నారాయణపేట టౌన్, జూలై 17 ప్రభాతవార్త:** టీబి ముక్త్ భారత్ అభియాన్ నేషనల్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉచితంగా ఎక్స్‌రెలు తీసి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరంగా జాగ్రత్తలతో ఆహారం పరిశుభ్రత సూచనలుజాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐయంఎ అధ్యక్షులు డా.వైమల్లికార్జున్, కార్యదర్శి డా.ప్రసాద్‌శెట్టి, కోశాధికారి డా. గీత, ఆదిత్య గౌడ్, పద్మకళ, నీలవర్ణ, ప్రీతిరెడ్డి, ప్రసాద్, మౌనికతో పాటు తదితరులు ఉన్నారు.

## మెంబర్ షిప్ అవకాశం కల్పించాలి

**టియుసిఐ కార్మిక సంఘం నాయకులు**

**నారాయణపేట టౌన్, జులై 17 ప్రభాతవార్త :** చేనేత సంఘంలో మెంబర్షిప్ అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం టియుసిఐ కార్మిక సంఘం నాయకులు చించే నారాయణ ఎదురింటి నర్సిములుతోపాటు చేనేత కార్మికులు జౌలి శాఖ అధికారి డివో విజయ్ కుమార్‌ను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారితో వారు మాట్లాడుతూ నారాయణపేట పట్టణం గాంధీనగర్‌కు చెందిన 100 మంది చేనేత కార్మికులను చేనేత సంఘంలో మెంబర్షిప్ కోసం అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల టియుసిఐ కార్మిక సంఘంనాయకులు కెంచె నారాయణ, ఎదురింటి నర్సిములు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారి డివో విజయ్ కుమార్ కార్మికుల వారసులకు సభ్యత్వం చేసుకున్నందుకు అవకాశం కల్పించారు.దీంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. జౌలిశాఖ అధికారిని కలసిన వారిలో కార్మిక వారసులు నికిల్, నవీన్, రాఘవేంద్ర, కిరణ్, నరేష్, జగదీష్, నాగేష్, రాజేష్, అభిషేక్,శ్రీమన్నారాయణ,అజయ్, అభిషేక్, నరేష్ పాల్గొన్నారు.

## ఎరువు కోసం లైన్ కట్టిన 'రైతు' ఆధార్

**రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది : వ్యవసాయ శాఖ అధికారి మిథున్ చక్రవర్తి**



ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన రైతులు

**మక్తల్ టౌన్, జూలై 17 (ప్రభాతవార్త):** ప్రజా ప్రభుత్వంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మక్తల్ మండల కేంద్రంలో గురువారం యూరియా కోసం రైతులు ఆధార్ కార్డులు లైన్లో పెట్టి పడిగాపులు పడుతున్నారు. ప్రజలకు సరిపడా యూరియా ప్రభుత్వం సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన ఎరువు ప్రభుత్వం సరఫరా చేసి రైతులకు అండగా ప్రభుత్వం ఉండాలని రైతులు కోరుతున్నారు. ఎరువుల కొరత లేదని కావలసినన్ని బస్తాలు గోడౌన్ లో ఇవ్వడానికి అందుబాటులో ఉన్నా యని రైతులందరూ ఒకేసారి గుమి గూడడం తో వారి యొక్క ఆధార్ కార్డులు పాసు పుస్తకాలు లైన్లో పెట్టడం జరిగిందని వ్యవసాయశాఖ అధికారి మిథున్ చక్రవర్తి తెలియజేశారు.



గోదాంలో నిల్వ ఉన్న ఎరువులు

## రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా ఏ నరసింహారెడ్డి బాధ్యతలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 17, (ప్రభాతవార్త) :** మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గా ఏనుగు నరసింహ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిని మర్యాద పూర్వ కంగా కలిశారు. జూన్ 30 న రెవెన్యూ అదనపు కలెక్టర్ యస్.మోహన్ రావు పదవీ విరమణ చెందడం తో స్పెషల్ కలెక్టర్ మధు సూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, సెక్షన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు

## రియల్ ఎస్టేట్ వ్యాపారి బాలునాయక్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ వెంకటేశ్వర్లు

**బాలానగర్, జూలై 17 (ప్రభాతవార్త):** బాలానగర్ మండలంలోని చిన్నంగుల గడ్డ తాండ వద్ద ఈనెల 10వ తేదీన రియల్ ఎస్టేట్ వ్యాపారి బాలునాయక్ పై గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హత్య చేయడానికి ప్రయత్నించిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనపై మహబూబ్ నగర్ డిఎస్‌పి వెంకటేశ్వర్లు బాలానగర్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీన బాలునాయక్‌ను పథకం ప్రకారంగా కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రణాళికను రచించారు. చిన్నంగుల గడ్డ తండా కస్తూర్బా గాంధీ పాఠశాల గేటు ముందు నిలబడి ఉన్న బాలు నాయక్‌ను కారుతో ఢీ కొట్టి, మారణాయుధాలతో హత్య చేసేందుకు ప్రయత్నించారు. వెంటనే బాలునాయక్ తప్పించుకొని ఓ ఇంట్లోకివెళ్లి తప్పించుకున్నాడు. అనంతరం కారులో వచ్చిన వ్యక్తులు పరారయ్యారు. హైదరాబాద్‌కు చెందిన బాలానగర్‌కు చెందిన ఒకరు, ఖమ్మం జిల్లాకు చెందిన మరొకరు, హైదరాబాద్‌కు చెందిన శివుడి హత్య చేసేందుకు ప్రయత్నించారు. దాడి జరిగిన అనంతరం బాలు నాయక్ బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి గురువారం ఏడు మంది నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. హత్యకు పథకం రచించిన సభావత్ శ్రీను అలియాస్ సేవాలాల్ శ్రీను, మరో ఇద్దరు వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కేసును ఛేదించిన జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, బాలానగర్ ఎస్ఐ లెనిన్, పోలీస్ సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

## జడ్చర్లను అభివృద్ధిలో ముందు ఉంచుతాం..

**- మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత**



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి,కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

**జడ్చర్ల జూలై 17, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీని అభివృద్ధిలో నెంబర వన్ గా నిలిపేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు రంగారావు తోటలో సిసి రోడ్ల నిర్మాణానికి కమిషనర్ లక్ష్మారెడ్డి తో పాటు స్థానిక కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆమెశంకుస్థాపన చేశారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని తన వార్డులో ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, సిసి రోడ్డు పనులు పూర్తి చేస్తున్నామని, విద్యుత్ కొరత లేకుండా కొత్త ట్రాన్స్ఫార్మ ర్ ను ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యను సైతం సైతం పరిష్కరించామన్నారు. తన వార్డుకు మరిన్ని నిధులు తీసుకొచ్చి మిగిలిన అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కౌన్సిలర్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పుష్పలతను కౌన్సిలర్ కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రిటైర్డ్ ఉద్యోగులు నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీలకు కుట్టు మిషన్లు పంపిణీ

**నారాయణ పేట, జూలై17 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నదని ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్‌లు అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరిగిందని రాబోయే మూడేళ్లలో మరిన్ని ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీని ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. నిరుపేద ముస్లిం మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లను అందించడం జరుగుతుందన్నారు. మిషన్లు రానివారికి మరిన్ని మిషిన్లు కేటాయించి వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మార్కెట్ చైర్మన్‌శివారెడ్డి,పట్టణ అధ్యక్షులుఎండి సలీం, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహమూద్ ఖురేషి, నాయకులు యూసుఫ్ తాజ్,అమీరుద్దీన్, తఖి బాబా, దర్గా పీఠాధిపతులు సయ్యద్ గయాసుద్దీన్ ఖాదిరి, గందే చంద్రకాంత్, మనోహర్ గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

**ఊట్కూర్, జూలై 17 ప్రభాతవార్త:** మక్తల్ నియోజ వర్గంలోని ఊట్కూర్ మండ లానికి చెందిన బాధితు లకు గురువారం మంత్రి వాకిటి శ్రీహరి నియోజకవర్గ కేంద్రం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు 22 మందికి అందజేశారు. పేద ప్రజలకు ముఖ్య మంత్రి సహాయ నిధివరం లాంటిదని అన్నారు అనారోగ్యంతో బాధపడు



తున్న బాధితులకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు అభినందనలు

**ఊట్కూర్, జూలై 17 ప్రభాతవార్త :** ఖేలో ఇండియా సౌత్ జోన్ ఉమెన్స్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు, ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో సైకిల్ రైడర్స్ కు తెలంగాణ క్రీడాశాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి ,జిల్లాసైక్లింగ్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి,లక్ష్మారెడ్డి,కోళ్ల వెంకటేష్,పాఠశాల ప్రిన్సిపల్ మంజుల, పిఈటిలులావణ్య,మంజుల,ఉపాధ్యాయబృందముమెడల్స్,సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాల అంటే ఒక కుటుంబం

◆ రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా

◆ విద్యార్థులకు న్యూట్రీషియన్‌తో కూడిన ఆహారం ఇవ్వాలి : నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, జూలై17 ప్రభాతవార్త:** విద్యా శాఖ కార్యక్రమాల అమలు తీరు తెన్నుల పరిశీలన నిమిత్తం వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా గురువారం గుండుమల్ మోడల్ స్కూల్ కళాశాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి సందర్శించారు. స్కూల్ లో ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమపిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయవద్దని, ఇలాంటి సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లల చదువు, పాఠశాలలో వసతి సౌకర్యాల గురించి తెలుసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని వారానికొక సారి పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల అంటే ఒక కుటుంబం అన్నారు. మన బడి అనే భావన ఉండాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆమె తెలిపారు. ప్రస్తుతం విద్యా శాఖ ప్రాథమిక పాఠశాలలలో ఏఎక్స్ఎల్ ఏ1 ల్యాబ్ పెడితే తల్లిదండ్రులు పోటీపడి మరీ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారని చెప్పారు. ఇప్పుడున్న ఏఎక్స్ఎల్ ఏ1 ల్యాబ్ లే కాకుండా త్వరలో కంప్యూటర్లతో పాటు ఆర్టిఫిషియల్ పాఠశాలలను చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటుకు వెళ్తే 50 నుంచి లక్షపెట్టి కోచింగ్‌తీసుకోవాల్సి వస్తుందని,కానీ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నసౌకర్యాలను వినియోగించుకుంటే డబ్బులు అవసరంలేదన్నారు. ఈసమావేశానికి వచ్చిన తల్లిదండ్రులుమూడు నెలల్లో గుండుమల్ మోడల్ స్కూల్‌లో మార్పు చూపించాలని ఆమె కోరారు.

◆ **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ..** విద్యార్థులకు న్యూట్రీషియన్‌తో కూడిన ఆహారం ఇవ్వాలని సీఎం ఈ కార్యక్రమం చేయిస్తున్నారన్నారు. ఎడ్యుకేషన్ సెట్ కావాలంటే ముందుగా విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ పాఠశాలకు కంప్యూటర్లు ఇచ్చామని చెప్పారు. జిల్లాలోని గుండుమల్ మోడల్ స్కూల్‌లో ఎన్ రోల్‌మెంట్ పెరిగిందన్నారు. పీఎం శ్రీకింద ఎంపికైన గుండుమల్ మోడల్ స్కూల్‌కి కేంద్రం,రాష్ట్రం నుంచి చాలా నిధులు వస్తాయన్నారు. ఇప్పటికే కడ నుంచి 60 లక్షల ప్రత్యేక నిధులు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

◆ **విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నెకోలస్ మాట్లాడుతూ..** చాలా మోడల్ స్కూల్ లలో రెగ్యులర్ స్టాఫ్‌ఉన్నారని, కానీ పదో తరగతి ఫలితాలలో 85శాతం ఉత్తీర్ణత మాత్రమే ఉంటుందని, కానీ కస్తూర్బా పాఠశాలలలో కాంట్రాక్టు ఉపాధ్యాయులే ఉన్నా అక్కడ 99 శాతం ఫలితాలు ఉంటున్నాయని చెప్పారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఇంకా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఫలితాల మెరుగుకు కృషి చేయాలని ఆయన సూచించారు. పాఠశాలలోని బయాలజీ ల్యాబ్, కంప్యూటర్‌గది, ఇంగ్లీష్ ల్యాబ్,లైబ్రరీ, బ్యూటీషన్ ట్రైనర్ గది,లైబ్రరీ,మరుగుదొడ్లు,పాఠశాల పరిసరాలను చూసి అపరిశుభ్రతపై పాఠశాల ప్రిన్సిపల్‌పైఅసహనం వ్యక్తంచేశారు. పనితీరు మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు వెంకట నరసమ్మ, మదన్, ఆర్జెడి విజయలక్ష్మి, రాష్ట్ర విద్యాశాఖ జిసిడిఓ శిరీష,డిఇఓ గోవిందరాజులు, జిసిడిఓ నర్మద, విద్యా శాఖ అధికారులు విద్యా సాగర్, శ్రీనివాస్, యాదయ్య శెట్టి, తహసీల్దార్ మహేష్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

■ పైరవీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తావు లేదు

■ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

■ మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,జూలై17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అంటేనే వెనకబడిన ప్రాంతాలు, గల్లీల అభివృద్ధిని కోరుకునేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెండవ వార్డులో ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్నింగ్ వాక్ చేశారు. వార్డులోని ప్రజలతో కలివిడిగా తిరుగుతూ వారి యోగక్షేమాలు,వార్డులోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 19 నెలల్లోనే అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అందులో భాగంగానే పేదలకు రేషన్ కార్డులు ఇవ్వడం, రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యంపంపిణీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఒక్కవనపర్తి నియోజకవర్గంలోనే 3500 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని అన్నారు.గతంలో కొన్ని బిల్డింగ్స్ కట్టిఅదే అభివృద్ధి అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని, ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ప్రజలకు కనీస అవసరాలు అయినా మౌలిక వసతులు కూడా గత ప్రభుత్వం కల్పించలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ఇప్పటికే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు,దాదాపు లక్షయాభై వేల ప్రైవేటుఉద్యోగాల నియామకాలు చేశామని,ఒక ప్రణాళికబద్ధంగా నియామకాలు చేయడం వల్ల ఒక్క పొరపాటు కూడా జరగలేదని అన్నారు. పైరవీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తావు లేదన్నారు. మార్నింగ్ వాక్ చేయడం అంటేనే ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని వాటిని పరిష్కరించడం అని, భవిష్యత్తులోకూడాఈ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించి ప్రజలను నేరుగా కలుసుకొనివారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్లచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకల మహేష్, స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ రమాదేవి, మధుసూదన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, బొంబాయి మన్నెంకొండ, రంజిత్ పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ



గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 17 ప్రభాతవార్త:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామీణ స్వయం ఉపాధికేంద్రాన్ని ఎంపీ మల్లురవి ప్రారంభించారు. వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సమీపంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఇటిఐ) ను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి శాసన సభ్యులు మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ గ్రామీణ యువతకు నైపుణ్యాలు అందించేందుకు రూరల్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ సంస్థల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. స్వయం ఉపాధి కోసం వచ్చేవారికి వేగంగా శిక్షణ కల్పించి ఉపాధి మార్గం చూపించాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామీణ ప్రాంతప్రజలకు, యువతకు నైపుణ్యాలు అందించేందుకు స్వయం ఉపాధిశిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కేంద్రాల ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డిఆర్‌డిఓ ఉమాదేవి, వనపర్తి మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, యూనియన్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా సిజిఎం భాస్కరరావు, రీజనల్‌హెడ్ సత్య నారాయణ, ఎల్డిఎం శివకుమార్, సాయి ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, శిక్షణ సంస్థ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

*సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు*

## పురుగుల బియ్యం సరఫరా

**కరువైన అధికారుల పర్యవేక్షణ**



పురుగులు పట్టిన బియ్యాన్ని అచ్చంపేట గోదాంకు తరలిస్తున్న పాఠశాల సిబ్బంది

**లింగాల, జూలై 17 ప్రభాతవార్త:** మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రారంభంలోని జూన్ నెలలో పాఠశాలకు 70 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేశారు. పంపించిన బియ్యం పురుగు పట్టి ఉండడంతో ఆబియ్యాన్ని తిరిగి వెనక్కి పంపించాలని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంతో అవే బియ్యాన్ని విద్యార్థులకు వండి పెట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు 70 క్వింటాళ్ల బియ్యంలో40కేజీల పురుగుపట్టిన బియ్యాన్ని సివిల్ సప్లై, అచ్చంపేట గోదాంకు గురువారం తరలించారు. 30 క్వింటాళ్ల పురుగులు పట్టిన బియ్యం విద్యార్థులకు వంట చేసి పెట్టారంటే అక్కడ పని చేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంఎంతో ఉందో తెలుస్తుంది. ఇంత జరుగుతున్న అధికారుల మాత్రం పర్యవేక్షించకపోవడం గమనార్హం.

**ప్రిన్సిపల్ వివరణ :** పాఠశాల, కళాశాలకు పురుగులు పట్టిన బియ్యం వచ్చింది వాస్తవమే అని తెలిపారు. వచ్చిన బియ్యాన్ని కూలీలచే శుభ్రం చేయించి వంట చేయిస్తున్నట్లు తెలిపారు. అచ్చంపేట గోదాంలోనే ఉన్న బియ్యం పాఠశాలకు వాటిని సరఫరా చేశారని, వాటికి పురుగు పట్టడంతో పై స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం బియ్యం రిటర్న్ చేసి వేరే బియ్యం ఇచ్చినట్లు తెలిపారు.

## కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా ఎంపీ డీకే అరుణ ఎన్నిక

**హర్షం వ్యక్తం చేసిన రఘువీర్ యాదవ్ అడ్వకేట్**

**నారాయణపేట ప్రతినిధి,జూలై 17 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లా పార్లమెంటు మెంబర్ డీకే అరుణ కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా గురువారం రోజు బాధ్యతలు తీసుకోవడం పట్ల కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

## కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

**గద్వాల టౌన్ జూలై17, ప్రభాతవార్త:** పత్తి విత్తన రైతులు పండించిన పంట ఎన్ని క్వింటాలు అయిన మొత్తం పంటను ప్రతి గింజను కూడా సీడ్ కంపెనీలు కొంటాయి అని రైతులకు కలెక్టర్ సంతోష్ హామీ ఇచ్చారు. గురువారం ఉదయం పత్తి రైతులు పెద్దఎత్తున తరలి వచ్చి కలెక్టర్ ఆఫీస్ ముందు బైఠాయించి ధర్నాచేశారు. ఈ ధర్నాపై కలెక్టర్ సంతోష్ స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రైతులు పండించిన ప్రతి గింజ సీడ్ కంపెనీలు కొంటాయని హామీ ఇవ్వడంతో రోడ్డుపై బైఠాయించిన రైతులు నిరసన విరమించారు. రైతుల నినాదాలతో దద్దరిల్లిన కలెక్టర్ కార్యాలయం ఒకసారిగా రైతుల ఆవేదనను అర్థం చేసుకుని రైతులు పండించిన ప్రతి గింజను కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సీడ్ పత్తి పండించిన రైతుల నుండి ఎకరాకు రెండు క్వింటాల పంటను మాత్రమే కొంటామని సీడ్ ఆర్గనైజర్లు కంపెనీలు రైతులపై షరతులు విధించడంతోపండించిన మొత్తం పంటను విక్రయించాలని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా పోలీస్ డిపార్ట్మెంట్ తగు చర్యలు చేపట్టారు. రైతుల అభిప్రాయం మేరకు కలెక్టర్ బయటకు వచ్చి మీరు పండించిన పంట మొత్తం సీడ్ పత్తి కంపెనీలు కొంటాయని స్పష్టమైన హామీ ఇవ్వగా రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అఖిలపక్ష కమిటీ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చాలా కాలం నుంచి నడిగడ్డ ప్రాంతంలో పత్తి విత్తన రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నటువంటి ఆర్గనైజర్లు మళ్ళీ ఈ సంవత్సరం కూడా రైతులు పండించిన పంట ఎకరమునకు రెండు క్వింటాలే కొంటాం అని కొత్త నాటకానికి తెరలేపడం దుర్మార్గం అన్నారు. అందుకే రైతులు ఆగ్రహానికి గురై గత బుధవారం బింగిదొడ్డి స్టేజ్ దగ్గర పెద్ద ఎత్తునధర్నా చేయడం జరిగిందన్నారు. గిట్టుబాటు ధర కల్పించకుండా, పండించిన పంటను కొనకుండగా, మరి వరి పంటకు బోనస్ ఇవ్వకుండా పేద రైతుల భూములను గుంజుకుంటూ వారి పైన అక్రమ కేసులు పెడుతూన్నారనీ ఆరోపించారు

## మహిళా సాధికారతే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సంబురాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల21న అచ్చంపేట పట్టణంలో నిర్వహించే ఇందిరా మహిళా శక్తి సంబురాలు మరియు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు,మహిళలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళాసంఘాలకు ఇస్తున్నవడ్డీలేని రుణాలతో పాటు మహిళలకు ప్రమాద బీమా,కుట్టుమిషన్ కేంద్రాలు, సోలార్ ప్లాంట్స్, పెట్రోల్ పంపులు, ఆర్టీసీ బస్సులు, మార్కెట్ సెంటర్లు, 15 సంవత్సరాలు పైబడిన వారితో పాటు వృద్ధులను, వికలాంగులను మహిళా సంఘాలలో చేర్చుటకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్న తరుణంలో వారిని సంఘ సభ్యులుగా చేర్పించడంపై మహిళా శక్తి ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబిఎం ట్రస్ట్ చైర్మన్, అమ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ డాక్టర్ చిక్కుడు అనురాధ,మండల పార్టీ అధ్యక్షులు హరి నారాయణ గౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ బెజ్జం మల్లికార్జున్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలుసరస్వతి, స్థానిక నాయకులు మోయిజ్, గురువయ్య, మాజీ సర్పంచ్ శత్రునాయక్, రేణయ్య, అంబ నారాయణ, స్థానిక నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన రైతులకు చెక్కులు అందజేసిన ఆర్డీవో

**నారాయణపేట టౌన్, జూలై17 ప్రభాతవార్త :** నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఆర్డిఓ కార్యాలయంలో గురువారం ఆర్డీవో రామచందర్ నాయక్ నష్టపరిహారం చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమక్తల్ మండలం మంతన్ గోడుకు చెందిన 27 మంది రైతులకు రూ.1.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేయడంజరిగిందన్నారు. భూములు అందించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎత్తిపోతల పథకంత్వరగా పూర్తి చేసేందుకు రైతులు ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని ఆర్డీవో కోరారు.

## శేషమ్మ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

**పెబ్బేరు, జూలై 17 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణం 12వ వార్డుకి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అఖిల్ చారి అమ్మమ్మ శేషమ్మ గురువారం స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వారినివాసానికి వెళ్లిపార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ మంత్రి వెంట పట్టణ పార్టీ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, చిన్న ఎల్లారెడ్డి, సాయిరెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్‌విశ్వరూపం,సహదేవుడు,సంతోష్, సొప్పరి బీచుపల్లి, రఘు,చింతకాయల వెంకటేష్, రమేష్, యాదగిరి గౌడ్,రాములు, వసంత్, బిసన్న, వై.రాము,శాంతన్న, శేఖర్, చారి ,వేణు ,సంబు రాము, తదితరులు పాల్గొన్నారు.

## వన సంరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే

**తెలకపల్లి, జూలై 17 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన సంరక్షణ అందరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రానికి చేరుకున్న వారువన మహోత్సవంలో భాగంగామండల కేంద్రంలోని కల్వకుర్తి రోడ్డు దగ్గర ఉన్న మల్లెలమ్మ దేవాలయం దగ్గర ప్రధాన రోడ్డు ఇరువైపులా ప్రజా ప్రతినిధులు అధికారులు విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్య నివారణ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ,ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ పార్టీ నాయకులు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**ఊట్కూర్, జూలై 17 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఉత్తర్వుల మేరకుగురువారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ ఆంజనేయులు రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలి పారు పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి పలు వాహనదారులకు జరిమానాలు విధించారు. వాహన దారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి 05 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందని ఈ ఏఎస్ఐ తెలిపారు.

## భద్రతా లోపాలు బట్టబయలు

**- ఎస్‌ఎఫ్ఐ పియూ అధ్యక్షుడు బత్తిని రాము**

**మహబూబ్‌నగర్, జూలై 17, ప్రభాతవార్త:** ప్రస్తుతం మోదీ ప్రభుత్వపాలనలో, దేశవ్యాప్తంగాఉన్న విద్యాసంస్థల్లో వేధింపులు, దాడులు అన్నీ సాధారణంగా మారిపోయాయని ఎస్‌ఎఫ్ఐ పియూ అధ్యక్షుడు బత్తిని రాము ఆరోపించారు. ఎస్‌ఎఫ్ఐ జాతీయ కమిటీ మేరకు పాలమూరు యూనివర్సిటీ పీజీ కలశాలలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఒడిశాలోని ఫకీర్ మోహన్ కాలేజ్‌లో ఓ విద్యార్థినిక్యాంపస్‌లోనే ఆత్మహత్యకు పాల్పడినఘటన, విద్యాసంస్థల లోని భద్రతా లోపాలను బట్టబయలు చేస్తోందని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ కాలకత్తా లా కాలేజ్ యూనియన్ కార్యాలయంలో ఓవిద్యార్థిని అత్యాచారానికి గురైందని, మహారాష్ట్రలోని థానే ప్రాంతంలోని ఓ పాఠశాలలో పాఠశాల యాజమాన్యం బాలికలకు ఒత్తిడి చేసి మాసిక ధర్మ పరిశీలన పేరుతో బలవంతంగా దుస్తులు తీసివేయించారని, వేధింపుల తీవ్రత ఉన్నాసంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం అన్నారు. ఈ వ్యవస్థను విద్యార్థి ఫ్రంట్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్ఐ) తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, మానువాది భావజాలాన్ని నమ్మే ఈ వ్యవస్థను కూలదోసేలా, న్యాయం కోసం పోరాడేలా ప్రతి ప్రజాస్వామ్యపు విద్యార్థిని ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ పియు ఉపాధ్యక్షులు శేఖర్, సాయి అభినయ్, నాయకులు సుధాకర్, వినయ్, రాజేష్, రవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కౌడి పీర్ల ఉత్సవాలు

**ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీహరి**

**నర్వ, జూలై 17 ప్రభాతవార్త :** నర్వ మండల కేంద్రం తో పాటు లంకాల,పాతర్ చేడ్ తదితరుల గ్రామాల్లో కౌడి పీర్ల ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా ప్రజలు పీర్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. పశుసంవర్ధక,మత్స్యకార, పాడి పరిశ్రమ,క్రీడా, యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. పీర్ల ఉగ్రం వచ్చిన వ్యక్తులు పీర్లను పట్టుకుని అగ్నిగుండంలో ఎగురుతూ పీర్లలో ఉన్న నిష్టను చూపుతున్నారు. ఈ వేడుకను తిలకించడానికి మండల నలుమూలల నుండి గ్రామ గ్రామాన భక్తులు తరలి వస్తున్నారు. గత వారం క్రితం ప్రారంభమైన ఈ వేడుక నేటి గురువారంతో ముగియనుంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం మంత్రికి, బాబు మియాలకు తులాబార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల మీదుగా పీర్ల ఊరేగింపుతో సమీప చెరువుల్లో పీర్లను నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవాల్లో నిర్వాహకులు బాబుమియా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెన్నయ్య సాగర్, నాయకులు శరణప్ప, కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, బీసం రవి, నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.